ప్రజాశక్తి
శుక్రవారం 30 జూన్ 2023
5
శ్రీకాకుళం

శ్రీకాకుళం జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

ఘనంగా బక్రీద్ వేడుకలు

ప్రజాశక్తి - ఆమదాలవలస, శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా బక్రీద్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు మసీదులు, దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు అలయ్ బలయ్‌తో శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఇళ్లల్లో ఖుర్బానీ నిర్వహించి సంబరంగా పండగను నిర్వహించుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని జామియా మసీదులో సామూహిక ప్రార్థనలో పెద్దసంఖ్యలో ముస్లిములు పాల్గొన్నారు. ఆమదాలవలస పట్టణంలో మసీదును శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సందర్శించారు. ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి సేవా నిరతి, క్షమాగుణం అలవర్చుకోవాలన్నదే బక్రీద్ పండగ ముఖ్య ఉద్దేశమన్నారు. శ్రీకాకుళం నగరంలోని జామియా మసీదును ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జామియా మసీదుకు 400 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. ముస్లిం మైనార్టీలను ఒబిసిలో చేర్చేందుకు తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. జామియా మసీదుకు ఎటువంటి సహాయం కావాలన్నా తనవంతుగా అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు తదితరులు జామియా మసీదును సందర్శించారు. కార్యక్రమంలో జామియా మసీదు అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, ఉపాధ్యక్షులు హాగీభయ్యా, కార్యదర్శి అక్బర్‌భాషా, సహాయ కార్యదర్శి షుకుర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మసీదులో శాసనసభ స్పీకర్ సీతారాం

అన్ని రంగాలకూ షాకే

- నడపలేక 2,431 పరిశ్రమలు మూత
- భారంగా మారిన రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ
- ఆక్వా, జ్యూట్ రంగాలపైనా మోత
- విద్యుత్ బిల్లులతో వ్యాపారుల విలవిల

ట్రూ అప్, ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జెస్ట్‌మెంట్ (ఎఫ్‌పిపిపిసిఎ) పేరుతో గతంలో ఎన్నడూ లేని రీతిలో అన్ని కేటగిరీల్లోని వినియోగదారులపైనా ప్రభుత్వం తీవ్ర భారం మోపింది. ప్రభుత్వం ఏదో రూపంలో విద్యుత్ ఛార్జీలను పెంచుతున్న ప్రతి సందర్భంలోనూ చిన్నాచితకా పరిశ్రమలు ఒక్కొక్కటిగా మూతపడతున్నాయి. వీధి దీపాలు, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణకు పంచాయతీలకు గుదిబండగా మారింది. ఆక్వాకు సబ్సిడీ ఇస్తున్న పెరిగిన ఛార్జీల భారంతో సతమతమవుతోంది. భారీగా వస్తున్న విద్యుత్ బిల్లులు చూసి వ్యాపారులు విలవిల్లాడుతున్నారు. మొత్తమ్మీద అన్ని రంగాలపైనా విద్యుత్ ఛార్జీల భారం పడింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మొత్తం 9,23,416 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 7,89,151 గృహ వినియోగ విద్యుత్ కనెక్షన్లు, 76,476 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 3,067 పరిశ్రమలకు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. వీధిదీపాలు, రక్షిత మంచినీటి కనెక్షన్లు 22,154 ఉన్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 వరకు వాడిన కరెంట్‌కు యూనిట్ ఏడు పైసలు వంతున వసూలు చేస్తోంది. వినియోగదారుడు ఐదేళ్ల కాలంలో వినియోగించిన మొత్తం యూనిట్లను ఏడు పైసలతో హెచ్చించి వచ్చిన మొత్తాన్ని 18 వాయిదాలుగా లెక్క కడుతున్నారు. 18 నెలల పాటు బిల్లులో కలిపి వసూలు చేస్తున్నారు. గతేడాది ఆగస్టు ఒకటో తేదీ నుంచి దీన్ని అమలు చేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఆ డబ్బులను వసూలు చేయనున్నారు.

ఇంధన ఛార్జీలతో ఉక్కిరిబిక్కిరి

ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పిసిసిఎ) పేరుతో విధిస్తున్న ఇంధన ఛార్జీల భారం అన్నిరంగాలనూ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. 2021-22 సంవత్సరంలో మూడు నెలలకో రేటు పెట్టి బిల్లులు వసూలు చేస్తోంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు యూనిట్‌కు 19 పైసలు, జులై నుంచి ఆగస్టు వరకు 61 పైసలు, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 56 పైసలు, జనవరి నుంచి మార్చి వరకు 64 పైసలు వసూలు చేస్తోంది. ప్రస్తుతం జారీ చేస్తున్న విద్యుత్ బిల్లుల్లో ఇవీ ఉన్నాయి. ఈ సంవత్సరానికి సంబంధించిన ఇంధన సర్దుబాటు ఛార్జీలనూ అదే బిల్లులో వసూలు చేస్తోంది. 2023 ఏప్రిల్‌కు సంబంధించి యూనిట్‌కు 40 పైసలు వసూలు చేస్తోంది. ఏ నెలకు సంబంధించిన సర్దుబాటు ఛార్జీలను అదే నెల బిల్లులో కలిపి జారీ చేస్తున్నారు. అన్నిరకాల ఛార్జీలు ఒకేసారి వసూలు చేస్తుండడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

నేడు ధర్నాలు

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యాన శుక్రవారం ధర్నాలు చేపట్టనున్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం, సబ్ స్టేషన్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు.

చిన్నాచితకా పరిశ్రమలు కుదేలు

విద్యుత్ ఛార్జీల భారంతో చిన్నాచితకా పరిశ్రమలు కుదేలు అవుతున్నాయి. ఇప్పుడు ట్రూ అప్, ఇంధన సర్దుబాటు ఛార్జీలు మోపడంతో మరింత సంక్షోభంలోకి వెళ్లాయి. జిల్లాలో ప్రస్తుతం 3,067 పరిశ్రమలకు విద్యుత్ సరఫరాను అందిస్తున్నారు. ముడిసరుకు దొరక్క, విద్యుత్ ఛార్జీల భారం భరించలేక ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 2,431 పరిశ్రమల యజమానులు తమకు విద్యుత్ సరఫరా నిలిపేయాలని కోరడంతో అధికారులు బిల్లుల జారీని ఆపేశారు.

భారంగా విద్యుద్దీపాలు, రక్షిత పథకాల నిర్వహణ

విద్యుత్ ఛార్జీల భారంతో స్థానిక సంస్థలకు వీధిదీపాలు, రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ కష్టంగా మారింది. మున్సిపాలిటీలు, పంచాయతీల్లో వీధిదీపాలు, రక్షిత మంచినీటి పథకాలు మొత్తం 22,154 ఉన్నాయి. మున్సిపాలిటీలకు ప్రభుత్వం నుంచి వస్తున్న గ్రాంట్లు, ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నులతో కొంతవరకు బిల్లులను భరించగలుగుతున్నాయి. పంచాయతీల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. పంచాయతీలకు ఇవ్వాల్సిన 14, 15వ ఆర్థిక సంఘాల నిధులను సైతం ప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఒక్కోసారి నిధులు ఇచ్చినా వాటి విద్యుత్ బిల్లుల కోసం మళ్లీ తీసుకుంటోంది.

ఆక్వా రంగంపై ప్రభావం

విద్యుత్ ఛార్జీల భారం ఆక్వా రంగంపైనా ప్రభావం చూపుతోంది. రొయ్యలు, చేపల చెరువుల్లో ఐదెకరాల్లోపు సాగు చేస్తున్న వారికి యూనిట్‌కు రూ.1.50, ఐదెకరాలకు మించి సాగు చేస్తున్న రైతులకు రూ.3.85 వసూలు చేస్తోంది. ఆక్వా రంగానికి సబ్సిడీ ఇస్తున్నా నిధులు విడుదల చేయడం లేదు. పైగా విద్యుత్ వినియోగానికి సంబంధించి రాయితీ ఇస్తున్నా ట్రూ అప్, ఇంధన ఛార్జీల విషయంలో ఎటువంటి మినహాయింపులు లేకపోవడంతో వాటికి భారంగా మారింది. సంతబొమ్మాళి మండలంలో గతంలో 400 ఎకరాల్లో సాగు చేయగా, ప్రస్తుతం వందెకరాల్లోనే రొయ్యలు, చేపల పెంపకం చేపడుతున్నారు.

భారీ బిల్లులతో వ్యాపారుల విలవిల

భారీగా వస్తున్న విద్యుత్ ఛార్జీలతో వ్యాపారులు షాక్‌కు గురవుతున్నారు. జిల్లాలో కేటగిరి-2 పరిధిలోకి వచ్చే వ్యాపార, వాణిజ్య సంస్థలకు సంబంధించి మొత్తం 76,476 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. పళ్ల రసాల దుకాణాల నుంచి షాపింగ్‌మాల్ వరకు అన్ని కేటగిరీ దుకాణాలకూ విద్యుత్ బిల్లుల భారం పడింది. వ్యాపారాలు సరిగా సాగక, నిర్వహణ, విద్యుత్ బిల్లుల భారంతో చిన్న చితకా వ్యాపారాలు మూత పడుతున్నాయి. విద్యుత్‌శాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో ఇప్పటివరకు 18,359 దుకాణాలు కరెంట్ సరఫరాను వద్దనుకున్నాయి.

'ఉపా' రద్దు చేసే వరకు పోరాటం

ప్రజాశక్తి - పలాస

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఉపా చట్టాన్ని రద్దు చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. స్థానిక సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అధ్యక్షతన గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ పిఒడబ్ల్యు జాతీయ కన్వీనర్ సంధ్య, ప్రొఫెసర్ హరిగోపాల్ లాంటి మేధావులపై తెలంగాణ ప్రభుత్వం ఉపా చట్టం కింద పెట్టిన కేసు దుర్మార్గమన్నారు. ఈ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు, అణగారిన వర్గాల పక్షాన నిలబడిన మేధావులపై ఎటువంటి విచారణ లేకుండా అన్యాయంగా, అక్రమంగా జైలులో బంధించడం సరికాదన్నారు. దేశద్రోహులు దేశాన్ని ఏలుతున్నారని విమర్శించారు. హిందూ మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటమే ప్రజలకు ముందున్న తక్షణ కర్తవ్యమన్నారు. ప్రశ్నిస్తున్న మేధావులు, ప్రజల పక్షాన గొంతు విప్పిన కవులు, కళాకారులు, జర్నలిస్టులను ఉపా చట్టం పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. అలాంటి మేధావులను కాపాడుకోవడానికి భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు తీవ్రతరం చేయాలని నిర్ణయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు ఎన్.గణపతి, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేషు, పిండి వెంకటరావు, సోమనాథం, పిడిఎం రాష్ట్ర నాయకులు వీరాస్వామి, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఈశ్వరమ్మ, ఐఎఫ్‌టియు జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, అరుణోదయ జిల్లా కార్యదర్శి సోమేశ్వరరావు, అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు బి.కూర్మారావు, పివైఎల్ జిల్లా కోకన్వీనర్ సోమేశ్వరరావు, పిడిఎస్‌యు నాయకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న సురక్ష' అమలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మంజూరు కావాలని శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమం అమల్లో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి, మండల ప్రత్యేక అధికారులు, తహాశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఉప తహాశీల్దార్లు, పంచాయతీ విస్తరణ అధికారులు, రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, డిజిటల్ సహాయకులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని, పథకాలు ఎంతమందికి అందడం లేదన్నది గుర్తించాలన్నారు. ప్రజలకు అందాల్సిన 11 రకాల సేవలపై వారి అభిప్రాయాన్ని తెలుసుకోవాలన్నారు.

షెడ్యూల్ ప్రకారం ఎంపిక చేసిన గ్రామాలు, వార్డుల్లో ఏర్పాటు చేస్తున్న శిబిరాల్లో తగినన్ని ప్రింటర్లు, లాప్‌ట్యాప్, డెస్క్‌టాప్, స్కానర్లు, స్టేషనరీ, హోలోగ్రామ్‌ల వంటి మౌలిక సదుపాయాలు సజావుగా ఉండాలన్నారు. శిబిరానికి వచ్చే ప్రజలకు మంచినీరు, స్నాక్స్, నీడ వంటి సౌకర్యాలను కల్పించాలని సూచించారు. వైద్య శిబిరాన్నీ ఏర్పాటు చేయాలన్నారు. శిబిరాల నిర్వహించే తేదీలను ఆయా గ్రామాల్లో, వార్డుల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. షెడ్యూల్ తేదీకి ఏడు రోజుల ముందు కార్యకలాపాలపై ప్రచారం చేపట్టాలని తెలిపారు. గ్రామ వార్డు సచివాలయ కార్యదర్శులు వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సిద్ధం కావాలన్నారు. శిబిరానికి వచ్చే ప్రజలకు కావాల్సిన పలురకాల సేవలకు సంబంధించిన వివరాలను తెలియజేసి, వారికి ప్రభుత్వ పథకం లబ్ధి చేకూరే విధంగా ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు సహాయ సహకారాలు అందించారు.

వైసిపి రాక్షస పాలనను తరిమికొట్టాలి

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ఆమదాలవలస : వైసిపి రాక్షస పాలనను తరిమికొట్టాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. పట్టణంలోని రైల్వే అండర్ టన్నెల్ వద్ద చేపడుతున్న పైకప్పు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరు చెప్పి ప్రజలపై ధరల బాదుడు బాదుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి జాడే లేకుండా పోయిందని విమర్శించారు. అక్రమాలను ప్రశ్నించిన వారిని అరెస్టులు చేస్తూ అరాచక పాలన సాగిస్తోందన్నారు. భవిష్యత్‌కు గ్యారంటీలో భాగంగా టిడిపి మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఆమదాలవలస పట్టణంలో గతంలో అండర్ టన్నెల్‌లో విద్యుత్ కాంతుల్లేక చైన్ స్నాచింగ్‌లు జరిగాయని విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన అక్కడ్నుంచే డిఆర్‌ఎంతో మాట్లాడారు. విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని కోరగా, త్వరలోనే ఏర్పాటు చేస్తామని డిఆర్‌ఎం హామీనిచ్చారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సినీ నటుడు శరత్‌బాబు తమ్ముడు మధు దీక్షిత్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యాలయ సమన్వయ కార్యదర్శి మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, నూక రాజు, అన్నెపు భాస్కరరావు, బోర గోవిందరావు, కూన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ప్రత్యేక కేటగిరీ ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జికెయుటి) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 2023-24 ప్రవేశాల్లో భాగంగా జులై 5 నుంచి తొమ్మిదో తేదీ వరకు ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నట్లు ఆర్‌జికెయుటి ఛాన్సలర్ కె.సి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 38,490 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. రీ వెరిఫికేషన్ పెట్టుకున్న విద్యార్థులు తమ మార్కులు పెరిగితే వచ్చే నెల ఐదో తేదీ లోగా నోటిఫికేషన్‌లో ఇచ్చిన వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సూచించారు. అలా పొందుపరిచిన మార్కుల జాబితాల ఆధారంగా వారి దరఖాస్తులో మార్కుల వివరాలను సవరిస్తామని తెలిపారు. ప్రత్యేక కేటగిరీకి సంబంధించిన క్యాప్, ఎన్‌సిసి, స్పోర్ట్స్, పిహెచ్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన షెడ్యూల్‌ను ఈనెల 30వ తేదీన యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచుతామని తెలిపారు. విద్యార్థులు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

4న మెగా రక్తదాన శిబిరం

- 10, 11న అంగన్వాడీల ధర్నా
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని జులై నాలుగో తేదీన శ్రీకాకుళంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు తెలిపారు. కార్మికులు పెద్దసంఖ్యలో హాజరై రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, పూర్తిస్థాయి పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు. కెజిబివిల్లో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ టీచర్లందరినీ యధావిధిగా విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిల్లా పర్యటన సందర్భంగా కెజిబివిల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను చులకన చేస్తూ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థలో విలీనమైన ఏడు పంచాయతీల కార్మికులను ఆప్కాస్ పరిదిలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. విలీన పంచాయతీ కార్మికులకు సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ, హెల్త్ అలవెన్స్ అమలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీల భారంతో ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్రం మాదిరిగా వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జులై 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద 36 గంటల ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. అంగన్వాడీలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల సంక్షేమ పథకాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ కె.నాగమణి, ఎం.ఆదినారాయణమూర్తి, అల్లు మహాలక్ష్మి, ఎన్.వి రమణ, హెచ్.ఈశ్వరరావు, అల్లు సత్యనారాయణ, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తేజేశ్వరరావు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

శాసనసభ స్పీకర్ సీతారాం

పొందూరు : రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొంచాడలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ నాలుగేళ్లలో ప్రభుత్వం పలు సంక్షేమ పథకాల ద్వారా అందజేసిన లబ్ధిని ప్రజలకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో దేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గ్రామంలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.81 లక్షలతో ఇంటింటా కుళాయిలు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు లోలుగు కాంతారావు, సర్పంచ్ పెయ్యిల అనురాధ, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, తహాశీల్దార్ రాంబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సూర్యనారాయణ, జెఇ చైతన్య, మాజీ సర్పంచ్‌లు తవిటిరాజు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

శ్రీకాకుళం అర్బన్ : మత్స్యకారులను ఓటు బ్యాంకుగా వాడుకుని అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం, నాలుగేళ్లుగా వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. శ్రీకాకుళం రూరల్ మండలం పెద్దగణగళ్లవానిపేటలో కోతకు గురవుతున్న సముద్ర తీరాన్ని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించకపోతే గ్రామాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఎదురవుతుందని మత్స్యకారులు ఎంపీకి వివరించారు. తీరంలో మూడు నెలలుగా ఇన్‌ల్యాండ్ చానల్ వరకు కోతకు గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని విమర్శించారు. రక్షణ గోడ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్రామంలో అనేక మంది చేపల వేటకు దూరమయ్యారని, ఇన్‌ల్యాండ్ వరకు కోతకు గురైతే గ్రామంలో ఏఒక్కరూ వేటకు వెళ్లడానికి వీలుండదన్నారు. మరోవైపు నాగావళి నదిలో ఇసుక తవ్వకాల వల్ల సముద్ర నీరు నదిలోకి వచ్చి చేరుతోందని, దీనివల్ల భూగర్భజలాలు అడుగంటి ఉప్పునీరు బావుల్లోకి వచ్చి చేరుతోందన్నారు. మత్స్యకారుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ హామీనిచ్చారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు మైలపల్లి నర్సింగరావు, దేముడు, బర్రి వాణి, బర్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ లిస్టులో అక్రమాలపై చర్యలు

ముగ్గురిపై క్రమశిక్షణా చర్యలకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ద్వారా జరిగిన నియామకాల ప్రక్రియలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జిజిహెచ్)కు చెందిన ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలకు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. పలాసలో ఏర్పాటు చేస్తున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో పనిచేసేందుకు తొమ్మిది కేటగిరీలో 60 ఉద్యోగాలకు జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యాన నియామక ప్రక్రియ చేపట్టారు. వైద్య విద్య డైరెక్టరేట్ పరిధిలో ఉండే ఈ పోస్టుల భర్తీ కార్యక్రమాన్ని కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న జిల్లా ఎంపిక కమిటీ (డిఎస్‌సి) ద్వారా చేపట్టగా, జిజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం పర్యవేక్షించింది. నోటిఫికేషన్ ఆధారంగా అభ్యర్థుల నుంచి అందిన దరఖాస్తులను, వారి అర్హతలను, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పొజిషన్ వంటి వాటిని పరిశీలించి 51 మందితో మెరిట్ జాబితా రూపొందించి నోటీసు బోర్డులో పెట్టారు. నియామక పత్రాలు రూపొందిస్తున్న సమయంలో మెరిట్ జాబితాలో ఉన్న కొందరు అభ్యర్థుల విషయంలో తప్పులు జరిగాయని గుర్తించారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న రిసెప్షన్ కమ్ రిజిస్ట్రేషన్ క్లర్క్ పోస్టుకు మెరిట్ జాబితాలో చేర్చిన పొట్నూరు ఉమాదేవి (ఒసి-మహిళ)కి క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్లు తప్పుగా వేశారు. ఆమెకు 0.75కు బదులు 0.50 పాయింట్లు తగ్గించినట్లు గుర్తించారు. సపోర్టింగ్ స్టాఫ్, జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టుల మెరిట్ జాబితాలో చోటు సంపాదించిన ముగ్గురు అభ్యర్థులు కురమాన శైలజ (ఎస్‌సి-మహిళ), టొంపల పల్లవి (ఎస్‌సి-జనరల్), పూజారి వైష్ణవి (ఎస్‌టి-మహిళలు) ఉద్యోగ నోటిఫికేషన్‌లో పేర్కొన్నా, వయోపరిమితి ప్రకారం గతేడాది డిసెంబరు 31వ తేదీ నాటికి 18 ఏళ్ల వయసు పూర్తి చేసుకోలేదని గుర్తించారు. దీన్ని చివరి నిమిషంలో గుర్తించి డిఎస్‌సి చైర్మన్ అయిన కలెక్టర్ దృష్టికి జిజిహెచ్ సూపరింటెండెంట్ తీసుకెళ్లారు. దీనికి బాధ్యులు ఎవరో గుర్తించి చర్యలు తీసుకునేందుకు వీలుగా నోట్ ఫైల్ పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆ మేరకు విచారణ చేసి జిజిహెచ్ లోని ఆఫీస్ సూపరింటెండెంట్లు ఎన్.సన్యాసినాయుడు, జి.సింహాచలంతో పాటు సీనియర్ అసిస్టెంట్ ఎస్.ఉదయలక్ష్మిని బాధ్యులుగా గుర్తించి కలెక్టర్ ముందు పెట్టారు. ఆయన సూచన మేరకు ఈ ముగ్గురు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైద్యారోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్‌కు జిజిహెచ్ సూపరింటెండెంట్ లేఖ రాశారు.

జులై నెలాఖరులో కిడ్నీ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - పలాస

మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రి, రూ.700 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మంచినీటి పథకాన్ని జులై నెలాఖరులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు వెల్లడించారు. మండలంలోని అమలకుడియా, అమలకుడియా కాలనీ, పూర్ణభద్ర, వీరభద్రాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముందుగా గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో రాష్ట్రం అప్పులపాలవుతోందని, రాష్ట్రానికి అప్పులు ఇవ్వద్దని కేంద్రానికి లేఖ రాసిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, తాను అధికారంలోకి వస్తే ప్రస్తుత పథకాలన్నీ అమలు చేస్తారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఏదైనా కారణంతో ఇంకా సంక్షేమ పథకాలు అందనివారు అధైర్యపడొద్దని, అందరికీ అందిస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. జులై ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలతో పాటు పలురకాల సమస్యలను సచివాలయం వద్దే అక్కడికక్కడే పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలాస ఎంపిపి ఉంగ ప్రవీణ, సర్పంచ్ కొర్ల శిరీష, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, పలాస ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, కొర్ల మురళీకృష్ణ చౌదరి, సర్పంచ్‌లు ఎస్.తిరుమలరావు, టి.మదన్, కొర్ల సంతోష్ కుమార్, మండల సచివాలయం కన్వీనర్ దువ్వాడ రవికుమార్, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతిరావు, ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, తహాశీల్దార్ ఎల్.మధుసూదనరావు, ఎఒ పోలారావు, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యరాణిని సన్మానిస్తున్న ప్రసాదరావు

సౌమ్యరాణికి సత్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామీణ ప్రాంతంలో పుట్టిన సౌమ్యరాణి జాతీయ స్థాయిలో రాణించడం వెనుక ఎంతో కృషి, పట్టుదల దాగి ఉందని, ఆమెను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది క్రీడాకారులు తయారు కావాలని సెట్‌శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం వాడాడకు చెందిన కడపల సౌమ్యరాణి 66వ జాతీయ పాఠశాల ఛాంపియన్ షిప్ టోర్నమెంట్-23 జూడో మార్షల్ ఆర్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. దీంతో ఈమెకు గ్రామంలోని తరిణికృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యాన గురువారం అభినందన సభ నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ మండ శ్రీనివాస్ మాట్లాడుతూ సౌమ్యరాణి లాంటి క్రీడాకారి శ్రీకాకుళం జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. ఆమె అంతర్జాతీయ క్రీడాకారిగా ఎదిగి మరిన్ని పతకాలు సాధించాలన్నారు. అనంతరం ఆమెకు దుశ్శాలువ కప్పి సత్కరించారు. రూ.5 వేలు నగదు, మెమోంటో అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత క్రీడాకారులు ఖాసీంఖాన్ దంపతులు, ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, కోచ్ మణికుమార్, టస్టీలు రమణమూర్తి, ప్రసాద్, గణేష్, కామేశ్వరరావు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు

సచివాలయ నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

సచివాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల సచివాల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. సచివాలయం నిర్మాణం ఎప్పటిలో పూర్తి చేస్తారు? నిధులు ఇబ్బంది ఏమైనా ఉందా? ఇంకా ఇతర సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. సచివాలయం ఉద్యోగులు సమయపాలన పాటిస్తున్నారా? లేదా? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందేలా చూడాలని చెప్పారు. ఆయనతో పాటు పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ఉంగ ప్రవీణ, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, సర్పంచ్‌లు బాడాన పుష్ప, కె.సంతోష్‌కుమార్, ఎంపిటిసి మాజీ సభ్యులు దంతం వైకుంఠరావు, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ కంచరాన చాణక్య ఉన్నారు.

బొబ్బిలిపేట రోడ్డు గోతులమయం

అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని బొబ్బిలిపేటకు వెళ్లే రహదారి పరిస్థితి అధ్వానంగా తయారైంది. రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యతను ఇస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం మాటలకే పరిమితం అయ్యిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి అత్యంత దారుణ పరిస్థితిలో ఉండడంతో రాకపోకలు సాగించేందుకు నానా ఇబ్బందులు పడుతున్న విషయం అధికారులు, పాలకులకు తెలిసినా స్పందించకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం - పాలకొండ ప్రధాన రహదారి నుంచి బొబ్బిలిపేట నుంచి వెదుళ్లవలస రోడ్డు వరకు 4.40 కిలోమీటర్ల రహదారి గోతులమయంగా మారింది. 2009లో అప్పటి ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి రూ.పది లక్షల నిధులతో రోడ్లు రహదారుల భవనాల

గోతులమయమైన బొబ్బిలిపేట రోడ్డు

శాఖ ఆధ్వర్యాన శంకుస్థాపన చేసి తారు రోడ్డును నిర్మించారు. ఆ తరువాత కాలంలో 2016లో టిడిపి హయాంలో పాడైన రహదారి స్థానంలో నూతనంగా నిర్మాణం చేపట్టకుండా గోతులను కప్పి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం రహదారి గజానికో గుంతగా మారి రాకపోకలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పాలకులు కనీసం పట్టించుకోకపోవడం దారుణమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రహదారిపై బొబ్బిలిపేట, దండేవలస, చింతలపేట, వెదుళ్లవలస, తురకపేట, గొల్లపేట, సిరిసింపేట, నెల్లిపర్తి తదితర పది గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో 108 వంటి వాహనాలు గ్రామానికి చేరుకోవడానికి చాలా సమయం పట్టి ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులు, ఇతర పనులపై ఆమదాలవలస వెళ్లాలంటే గతంలో ఆటోలు ఈ రహదారిపై రాకపోకలు సాగించేవని, ఇప్పుడు రోడ్డు గోతులమయం కావడంతో ఎటువంటి వాహనాలు రాక నానా ఇబ్బందులకు గురవుతూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వస్తున్నదని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు రహదారిని నిర్మించి తమను కష్టాల నుంచి గట్టెక్కించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో ఆటోలు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ వి.సత్యనారాయణ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోలను రహదారులపై నిలిపి ట్రాఫిక్‌ను స్తంభింపజేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే ఓవర లోడు, డ్రైవింగ్ చేసినప్పుడు సెల్ ఫోన్లు మాట్లాడడం వంటివి కనిపిస్తే చర్యలు మరింత తీవ్రంగా ఉంటాయని అన్నారు. ప్రతిఒక్కరి వద్దా లైసెన్స్‌లు ఉండాలన్నారు. పాసింజర్లను ముందు సీట్లో కూర్చోపెట్ట కూడదన్నారు.

ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదన్నారు. స్కూల్ పిల్లలకి నడిపే ఆటోలు మరింత జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ చిరంజీవి, రైటర్ వాసు పాల్గొన్నారు.

పెంటిభద్రలో 'భవిష్యత్‌కు గ్యారంటీ'

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మూడో వార్డు పెంటిభద్రలో భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం టిడిపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని వైసిపి ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ముందుగా ఇంటింటికి వెళ్లి టిడిపి కరపత్రాలు పంపిణీ చేసి చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను వివరించారు. పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి నవీన్, గాలి కృష్ణ, నాబిల్లు శ్రీనివాసు, సవర రాంబాబు, కొవ్వూరు సురేష్, గురుటి సూర్యనారాయణ, చంద్రరావు, సత్యం, రామకృష్ణ, నరసింహులు, అప్పారావు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కవిటి: మండలంలోని బొరివంక బాలుర వసతిగృహంలో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వార్డెన్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వసతిగృహంలో 65 ఖాళీలు ఉన్నాయని, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ఓసి, మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఐదు కిలో మీటర్ల పైబడిన గ్రామాలకు చెందిన విద్యార్థులూ దరఖాస్తును చేసుకోవాలన్నారు. దరఖాస్తులను వసతిగృహంలో తీసుకోవాలని తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి- కవిటి

ప్రతి వ్యక్తీ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, శరీరంలో ఏ చిన్న మార్పు కనిపించినా స్థానిక ప్రభుత్వాస్పత్రిని సంప్రదించాలని రాజపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇఒ అభిమన్యుసోయి తెలిపారు. ఎల్‌సిడిఇ సర్వేలో భాగంగా మండలంలోని జల్లుపుట్టుగలో గురువారం అనుమానిత కేసులను పరీక్షించారు. అనంతరం స్థానికులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి భారతి, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

యువతి ఆత్మహత్య

ఆమదాలవలస : పట్టణంలోని కొత్తకోట వారివీధికి చెందిన బొడ్డేపల్లి మానస (20) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉపాధ్యాయుడు బొడ్డేపల్లి నారాయణరావు కుమార్తె మానస ఇటీవల కాకినాడ జెఎన్‌టియులో బిటెక్ ఇంజినీరింగ్ పూర్తి చేసింది. గురువారం ఉదయం ఏకాదశి కారణంగా 7.30 గంటల సమయంలో తల్లిదండ్రులు ఆలయానికి వెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమె పడక గదిలోని ఫ్యానుకు కొక్యానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆలయం నుంచి తిరిగి వచ్చిన తల్లిదండ్రులు తలుపులు తెరిచి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే స్థానికుల సహాయంతో కిందకు దించి రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలు తండ్రి మూడు రోజుల నుంచి తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వై.కృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. చేతికందివచ్చిన కుమార్తె ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నిందితులను ప్రవేశపెట్టిన సిఐ పైడయ్య

గంజాయితో ముగ్గురు అరెస్టు

ఆమదాలవలస : పట్టణంలోని వన్ వే కూడలి వద్ద బుధవారం సాయంత్రం గంజాయితో ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.పైడయ్య తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిందితులను గురువారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. వన్ వే కూడలి వద్ద ఎస్ఐ రఘునాథరావు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఆ సమయంలో అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా బ్యాగులతో తిరుగుతున్నట్లు తెలిపారు. బ్యాగులను తనిఖీ నిర్వహించగా గంజాయి దొరికిందని, వెంటనే వెంటనే అదుపులోకి తీసుకున్నామని అన్నారు. విచారణ చేపట్టగా కేరళ రాష్ట్రం మల్లాపురం జిల్లాకు చెందిన మహమ్మద్ సహల్ కథల్ పరంబత్, మసూద్ కరణ్ చేరి, అప్సల్ పాలక్కల్ యువకులుగా తేలిందన్నారు. వీరు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్ నుంచి గంజాయిని కేరళ రాష్ట్రానికి తరలిస్తూ విశ్రాంతి కోసం ఇక్కడ దిగినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని తెలిపారు.

చిన్నారులకు అన్నదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనో వికాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యాన గురువారం అన్నదానం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ సెంట్రల్ రీజనల్ చైర్మన్ నటుకుల మోహన్, శ్రీకాకుళం-1 టౌన్ ఎస్ఐ మొజ్జాడ ప్రవల్లికలు మాట్లాడుతూ మానసిక వైకల్యంతో బాధపడుతున్న చిన్నారులకు సేవలందించడం అభినందించారు. కార్యక్రమంలో సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ప్రెసిడెంట్ శిల్లా రమేష్, సభ్యులు పొడుగు చరణ్, రాజు యాదవ్, జెసిఐ గ్రీన్ సిటీ మణిశర్మ, జిల్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి, కె.శివ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

తూర్పుకాపు సంఘ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- లావేరు

తూర్పుకాపు సంఘం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బెజ్జిపురంలో జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంక్షేమం ఆధ్వర్యాన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తూర్పుకాపు సంక్షేమాభివృద్ధికి పార్టీలకతీతంగా కృషి చేయాలని అన్నారు. మాజీ మంత్రి, కీర్తిశేషులు గొర్లె శ్రీరాములునాయుడు తూర్పుకాపులు అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, ఇప్పుడు ఆయన బాటలో మనమంతా రాజకీయాలకతీతంగా ముందుకు సాగాలని అన్నారు. సమావేశంలో డోల జగన్, కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు, ఎ.రామకృష్ణ, పిన్నింటి మధుబాబు, ఇజ్జాడ శ్రీనివాసరావు, డి.రాజనాయుడు, పిన్నింటి సాయికుమార్, మీసాల వెంకటరమణ, గొర్లె రాధాకృష్ణ పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

రణస్థలం : రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, వైసిపి పార్లమెంటరీ పార్టీ నాయకులు, వైఎస్ఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డిని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కలిశారు. సాయిరెడ్డి గురువారం విశాఖపట్నం వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎమ్మెల్యే వెంట వైసిపి నాయకులు ఉన్నారు.

మాట్లాడుతున్న కోణార్క్ శ్రీను

ఒబిసిలో చేర్చే ప్రతిపాదనపై హర్షం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రంలోని కళింగ కోమట్లను ఒబిసిలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించడం హర్షదాయకమని కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కళింగ కోమటి సంఘ రాష్ట్ర అధ్యక్షులు పట్నాల శ్రీనివాసరావు (కోణార్క్ శ్రీను) అన్నారు. నగరంలోని క్లాత్ మర్చంట్ అసోసియేషన్ భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. కళింగ కోమట్లను ఒబిసిలో చేర్చేందుకు కొంత కాలంగా పోరాటం చేశామని అన్నారు. అందులో భాగంగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తంగుడు జోగారావు, రాష్ట్ర కోశాధికారి శ్రీరామ్మూర్తి, ఒబిసి కమిటీ చైర్మన్ ఎస్.వి.జి.మూర్తి, ఉన్న సర్వేశ్వరరావు, గుడ్ల దామోదరరావు, అంధవరపు ప్రసాద్, కోరాడ పద్మావతి, కిల్లంశెట్టి ధనలక్ష్మి పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

మొక్కను నాటుతున్న గోపాల్

పలాస: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ పిలుపునిచ్చారు. మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యాన పళ్లను ఇచ్చే జామి, చెర్రీ, నీడనిచ్చే కాము, బాదం మొక్కలను గురువారం నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమవుతున్న ప్రస్తుత తరుణంలో మొక్కలు నాటడం వల్ల త్వరగా పెరుగుతాయని చెప్పారు. సత్యసాయి విద్యా విహార్ ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు మాట్లాడుతూ ఔషధ మొక్క నాటి సత్య సాయి ట్రస్టు ద్వారా కోటి మొక్కలు నాటాలని సంకల్పించామని చెప్పారు. కార్యక్రమంలో విద్యావిహార్ కార్యవర్గ సభ్యులు రమేష్, ప్రిన్సిపాల్ ప్రీతి, గ్రీన్‌ఆర్మీ ప్రధాన కార్యదర్శి బి.టి.రావు, దుర్యోధన మాస్టర్, నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత అస్పాన మధుబాబు, గ్రీన్ ఆర్మీ సభ్యులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉపేంద్ర, ఇరిగేషన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో సురవరపు సిమ్మినాయుడు అధ్యక్షతన పెన్షనర్ల సంఘ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన పిఆర్‌సి, డిఎ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. సంఘం కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఫ్యామిలీ పెన్షనర్స్ ఇకెవైసిని,

మాట్లాడుతున్న జనార్ధనరావు

అలాగే జులై 31లోగా ఈ-ఫైలింగ్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు దాస్యం లక్ష్మణరావు, నైనపాత్రుని చంద్రశేఖరరావు, కూర్మాన షణ్ముఖరావు, బెండి సూర్యనారాయణ, చిట్టయ్య, బొడ్డేపల్లి వెంకటరమణ, పేడాడ అప్పారావు పాల్గొన్నారు.

చురుగ్గా ఆస్పత్రి పనులు

పనులను పరిశీలిస్తున్న జెడ్‌పిటిసి నారాయణమ్మ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ఈదుపురంలో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ తెలిపారు. ఈ మేరకు ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ దాదాపు 80 వాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. మిగతా పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో ఈ చుట్టూ పక్కల, తీర ప్రాంత గ్రామాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

పలుచోట్ల బక్రీద్

పలాస : పలాస జామియా మసీదులో గురువారం ఈద్-అల్-అదా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలు జరుపుకున్నారు. ముస్లీం సోదరుల సామూహిక ప్రార్థనలతో అన్ని ఈద్గాలు, మసీదులు కిటకిటలాడాయి. కార్యక్రమంలో జామియా మసీద్ ఇమామ్ ముక్తార్ ఆలం, ప్రెసిడెంట్ భాష, సెక్రటరీ బషీర్, జామియా మసీదు జమాత్ సభ్యులు జబ్బార్, అబ్దుల్లా ఖాన్, ఫర్దోష్ ఖాన్, బబ్లూ, తమిమ్, లట్టు, ఖాదర్ సాబ్, ఖాసిం, రాజేష్‌ఖాన్, అహమద్ షా, గౌస్, జిలాని, పప్పు, షమ్మీ, ఫకీర్, జహంగీర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : బక్రీద్ పండుగ సందర్భంగా ఇచ్ఛాపురంలోని లాలాపేట, కస్పావీధి మసీదుల్లో ఘనంగ బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. లాలాపేటలో అనిసుల్ ఖాద్రీ, ముత్తా వలి

ఇచ్ఛాపురం : ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

మహమ్మద్ అహమ్మద్ అలీ, కస్పా మసీద్‌లో ఎం.డి.అస్లామ్, జోహర్ ఖాన్, అమీర్, అబ్దుల్, జుల్లు, ఆలీం ఖాన్ పాల్గొన్నారు.

రణస్థలం : రణస్థలం స్థానిక జామియా మసీదు ఆవరణలో గల ఈద్గా దగ్గర మసీదు నిర్వాహకులు అమీర్ సాహెబ్, కార్యదర్శి ఫకృద్దీన్, ముతవల్లి రహమాను, మస్తాన్, సర్దార్ సాహెబ్, డాక్టర్ బాష, పెదమస్తాన్, జానీ మాస్టర్, తాజ్ మహ్మద్ రఫీ, కుద్దుస్‌లు ప్రార్థనలు చేశారు.

మాట్లాడుతున్న సురేష్ మాదిగ

వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సురేష్ మాదిగ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎ,బి,సిడి వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ మాదిగ అన్నారు. పట్టణంలోని ఓ ప్రయివేట్ కళ్యాణ మండపంలో మాదిగల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణతోనే మాదిగలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో న్యాయం జరుగుతుందన్నారు.

జూలై చివరి వారంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యాన నిర్వహించనున్న హలో మాదిగ... చలో హైదరాబాద్ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్‌సి రిజర్వేషన్‌ను ఎ,బి,సి,డిలుగా విభజించే వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు, మాదిగ పోరాట సమితి నాయకులు బోసు మన్మథరావు, సీనియర్ నాయకుడు లోపింటి నారాయణరావు, పాస్టర్ రాడ విజయ్‌కుమార్, కంటిపాక కృపారావు, మండల అధ్యక్షులు నవిరి ప్రసాద్, కుర్మాన దుర్గారావు, కుర్మాన అశోక్, పెంకి రాజశేఖర్, సిరిపురపు సంతోష్, మురపాక ఈశ్వరరావు, గొంటి గణపతి, నవిరి రాజారావు, పుట్టా నవీన్ పాల్గొన్నారు.

మూడు పార్టీలూ బిజెపికి మద్దతుదారులే

బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి, ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి మద్దతుదారులేనని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి అన్నారు. స్థానిక అంబేద్కర్ భనంలో బిఎస్‌పి కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిజెపి ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తున్నా, రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా పాలకులు ఎవ్వరూ నోరుమెదపడం లేదన్నారు. బిజెపి నష్టదాయక విధానాలపై మూడు పార్టీలూ ప్రశ్నించడం లేదన్నారు. మౌలిక సమస్యలు పరిష్కరించకుండా సంక్షేమం ప్రస్తావన లేకుండా ఉచిత పథకాల పేరుతో ప్రజలను సోమరిపోతులుగా మార్చుతున్న ప్రభుత్వాలకు

మాట్లాడుతున్న పరంజ్యోతి

బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ముందుగా కాన్షీరాం, మహాత్మా జ్యోతీరావుపూలే, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ప్రజా నాట్య కళా మండలి నిర్వహించిన నృత్య ప్రదర్శనలను అందరినీ ఆకట్టుకున్నాయి. సమావేశంలో రాష్ట్ర కో-ఆర్డినేటర్ ప్రకాశరావు, సీనియర్ దళిత సంఘం నాయకులు కృష్ణమూర్తి, చింతాడ శ్రీనివాస్, రేవంత్, రుక్మాంగదరావు, కృష్ణారావు పాల్గొన్నారు.

రణస్థలం : ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

జి.సిగడాం మండలం పాలఖండ్యాం గ్రామ యువకులు కోరిక మేరకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ తన క్యాంప్ కార్యాలయంలో గురువారం రూ.20 వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు

పలువురికి ఆర్థికసాయం

మహంతి సత్యనారాయణ, కొర్నాన వెంకటసీతారాం, మీసాల రఘు పాల్గొన్నారు.

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్ల ఇందిరా కాలనీకి చెందిన కొండక కాళిదాసుకు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చులకు ఇబ్బందులకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న బ్రాహ్మణతర్ల హెల్పింగ్ వారియర్స్ సభ్యులు స్పందించి రూ.12,500లు ఆర్థికసాయం గురువారం అందజేశారు. కార్యక్రమంలో కుమార్, వేణు, ఆర్.జె.ఈశ్వర్, సీమ బాలరాజు, హరికృష్ణ, అనిల్, జోగారావు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని గురువారం ఏపి నాన్ కన్వెన్షనల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ కె.కె.రాజు గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి నిర్వహించిన పలు సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

జ్ఞాపికను స్వీకరిస్తున్న రాజు

ఆషాఢ మాసం శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని అరసవల్లి సూర్యనారాయణ స్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆయన ప్రాంగణంలోని అనివేటి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యాన సాంప్రదాయ బద్ధంగా కళ్యాణం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాలక మండలి సభ్యులు ద్వారపు అనురాధ పాల్గొన్నారు.

పాతకుంకాంలో విత్తన శుద్ధి

లావేరు: మండలంలోని పాతకుంకంలో గురువారం సామూహికంగా వరి విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధి సర్పంచ్ సెటికం వెంకటరమణ ఆధ్వర్యాన నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాబాజీ, శివకృష్ణ, కృష్ణ మాట్లాడుతూ విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేయడం వల్ల విత్తనం ఉండే వచ్చే ఎటువంటి తెగుళ్లనైనా అరికట్టి మొలక శాతం బాగా వస్తుందని అన్నారు. అలాగే వరి పంటకు సంబంధించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రాజీలేని సూత్రాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించారు.

కోలాటమాడుతున్న మహిళలు

అలరించిన కోలాటం

ఆమదాలవలస : పట్టణంలో జగన్నాథస్వామి మారుయాత్ర సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం పలువురిని ఆకట్టుకుంది. బుధవారం రాత్రి కాంద్రపేటలోని జగన్నాథ స్వామి ఆలయం వద్ద యాత్రికులు మారు రథయాత్రను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం చూపరులను ఆకట్టుకుంది. జయ జయ రామా జానకి రామా అంటూ సాగిన పాటకు లయబద్ధంగా మహిళలు కోలాటం ఆడటంతో వీక్షకులు, చిన్నారులు కళ్లార్పకుండా తిలకించారు. శివ కేశవ నృత్యానికేతన్ గురువు భార్గవ కృష్ణ పర్యవేక్షణలో ఈ కోలాటాన్ని మహిళలు నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా ఈ కోలాటం సాగింది.

ఉపాధి కల్పనకే స్కిల్ డెవలప్‌మెంట్

కోటబొమ్మాళి: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకే స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటు చేసినట్లు సత్యసాయి సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.లక్ష్మణ రావు, జిల్లా అధ్యక్షులు వై.లింగరాజు, స్థానిక పారిశ్రామికవేత బోయిన గోవిందరాజులు అన్నారు. స్థానిక శ్రీసత్యసాయి మందిరంలో స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువ కులకు ఉచితంగా కంప్యూటర్‌పై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.